ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-విజయనగరం

మహిళలకు, యువతకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించాలని డిఆర్ఒ అనిత పేర్కొన్నారు. రిజర్వు బ్యాంకు సూచనల మేరకు ఫిబ్రవరి 26 నుండి మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత పై వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌బిఐ రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఎల్‌డిఎం శ్రీనివాస రావు మాట్లాడుతూ ఈ ఆర్థిక అక్షరాస్యత అవగాహనా కార్యక్రమాలు 2016 నుంచి జరుగుతున్నాయని, ఈ ఏడాది మేక్ ఎ రైట్ స్టార్ట్, బికం ఫైనాన్సియల్లీ స్మార్ట్ అనే నినాదం తో జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి , నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ త్రివినాగ్, ఆర్‌డిఒ సూర్యకళ , డిప్యూటీ కలెక్టర్లు సుమ బాల, మురళీకృష్ణ, ఎఎల్‌డిఎం ప్రత్యూష , పశు సంవర్ధక శాఖ జెడి విశ్వేశ్వర రావు, మెప్మా పీడీ సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

టెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు
- 6 కేంద్రాల్లో 11530 మంది అభ్యర్థులు హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన పరిశీలకులు సుబ్బా రెడ్డి

సీతంలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పరిశీలకులు సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్ -2024) ఈ నెల 27 నుండి మార్చి 6వ తేదీ వరకు 6 కేంద్రాల్లో జరుగుతుందని టెట్ పరిశీలకులు ఎ. సుబ్బా రెడ్డి తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్ లో అన్‌లైన్ ద్వారా పరీక్ష జరుగుతుందని తెలిపారు. సోమవారం డిఇఒఛాంబర్‌లో డిఇఒ ప్రేమ కుమార్ తో కలసి టెట్ ఏర్పాట్ల పై విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 11,530 మంది అభ్యర్థులు 6 కేంద్రాల్లో పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష (టెట్)కు ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులకు అనుమతించేది లేదని చెప్పారు. జిల్లాలోని బొబ్బిలి 1, రాజాం 1, విజయనగరంలో 4 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని తెలిపారు. హాల్ టికెట్ తో పాటు, ఆధార్ కార్డు లేదా గుర్తింపు కార్డు తప్పకుండా తేవాల్సి ఉందన్నారు.

అభ్యర్థులకు సూచనలు

అభ్యర్థులు వారి హాల్ టికెట్ తో పాటు ఏదైనా ఒరిజినల్ ఐ.డి. ప్రూఫ్ తీసుకొని వెళ్లాలని, పరీక్ష ఆన్‌లైన్ లో జరుగుతుంది కావునా కనీసం 30 నిమిషాల ముందు చేరుకోవాలని తెలిపారు. వికలాంగులకు స్క్రైబ్ ను ఏర్పాటు చేస్తారని, వీరికి 50 నిమిషాల సమయం అదనంగా కేటాయించా మని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని , సందేహాల కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ 98497 39920, 9493313271, 8328575612 లకు సంప్రదించాలని తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

టెట్ పరిశీలకులు సుబ్బా రెడ్డి టెట్ కేంద్రాలైన ఎం.వి.జి.ఆర్., లెండి, సీతం కళాశాలలను తనిఖీ చేసారు. అన్ని రకాల వసతులు ఉన్నదీ లేనిది పరిశీలించారు. వి.టి.అగ్రహారంలో జెడ్‌పి హైస్కూల్ ను సందర్శించి మధ్యాహ్న భోజనం మెనూ ను తనిఖీ చేసారు. మెనూ ప్రకారంగా అన్ని రకాలు పెడుతున్నదీ లేనిది పరిశీలించారు. 7 నుండి 10 వ తరగతి ఆడ పిల్లలకు సానిటరీ నాప్కిన్స్ ఇస్తున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. చిక్కీ, గుడ్లు , టాయిలెట్లను పరిశీలించారు.

టిడిపిలో చల్లారని అసంతృప్తులు

- పునరాలోచన కోసం పోరాడుతాం : కెఎనాయుడు
- బాబుతో మాట్లాడాక నిర్ణయం ప్రకటిస్తాం : కర్రోతు
- భంగపడ్డ నేతలచుట్టూ అనుచరులు

గంట్యాడలో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు అనుచరులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి తరపున టిక్కెట్లు ఆశించి భంగపడ్డవారు, వారి అనుయాయుల్లో అసంతృప్తి జ్వాలలు కొనసాగుతున్నాయి. అధిష్టానం పునరాలోచించే విధంగా పోరాటం చేస్తానని, అప్పటికే టిక్కెట్ ఇవ్వకపోతే కేడర్ అభీష్టం మేరకు నడుచుకుంటానని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు చెబుతున్నారు. చంద్రబాబుతో కలిసి మాట్లాడిన తరువాత తన కార్యాచరణ ప్రకటిస్తానని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగారాజు అంటున్నారు. ఈ ఇద్దరు నాయకులు టిక్కెట్లు ఆశించిన విషయం విధితమే. ప్రస్తుతం వీరికి పార్టీ అవకాశం ఇవ్వకపోవడంతో వారి ముఖ్య అనుచరులు ఎలాగైనా పోటీ చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఈ మేరకు కెఎ నాయుడు ఇంటికి, ఆఫీస్‌కి అనుచరులు వస్తున్నారు. ఇటు నెల్లిమర్లలోనూ తొలి నుంచీ కలిసికట్టుగా ఉన్న నాయకులు బంగారాజును కలిసి కార్యాచరణ విషయమై ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం కెఎ నాయుడు తన నియోజకవర్గంతో ఎక్కడికక్కడ అంతర్గత సమావేశాలు ఏర్పాటుచేసి, అంతా కలిసికట్టుగా పార్టీ అధిష్టానంపై ఒత్తిడి చేద్దామని, అప్పటికీ పార్టీ వినిపించుకోకపోతే ఏం చేయాలనేది సమయం వచ్చినప్పుడు చూసుకోవచ్చని దిశానిర్ధేశం చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇదే విషయమై కెఎ నాయుడును ప్రజాశక్తి ప్రశ్నించగా టిక్కెట్ కోసం చివరి వరకు పోరాడతానని, ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చేందుకు పార్టీ పునరాలోచిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను నమ్ముకుని వేలాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, వారి అభీష్టం మేరకు నడుచుకుంటాను తప్ప, ప్రస్తుతం టిక్కెట్ పొందిన శ్రీనివాస్‌కోసం పనిచేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అటు బంగారాజుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నుంచి పిలుపు రావడంతో సోమవారం సాయంత్రం అమరావతికి బయలు దేరారు. మంగళవారం సాయంత్రం బాబు అపాయింట్‌మెంట్ ఇచ్చినట్టుగా సమాచారం. బాబుతో మాట్లాడిన తరువాతే తన నిర్ణయం చెబుతారని ఆయన ప్రజాశక్తికి చెప్పారు. మరోవైపు చీపురుపల్లి నియోకవర్గం గంటా శ్రీనివాసరావుకు కట్టబెడతారనే ప్రచారం జరుగుతుండడంతో స్థానిక ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున ముఖ్య అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు.

వరహాలనాయుడుశ్రీఅ వైసిపిలోకి ఆహ్వానిస్తున్న మంత్రి బొత్స

అభివృద్ధి జరిగితేనే ఓటేయండి

- రాష్ట్ర మంత్రి బొత్స సత్యన్నారాయణ
- వైసిపిలో చేరిన వరహాలునాయుడు

ప్రజాశక్తి-చీపురుపల్లి

నియోజక వర్గానికి మంచి, మేలు, అబివృద్ధి జరిగిందంటేనే తనకు ఓటు వేయాలని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యన్నారాయణ ప్రజలను కోరారు. సోమవారం చీపురుపల్లి మూడు రోడ్లు కూడలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 2004లో తాను చీపురుపల్లి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచినప్పటి నుండి అనేక విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. చీపురుపల్లికి రెవిన్యూ డివిజన్‌తో పాటు సబ్ డివిజన్ కూడా తీసుకు వచ్చానని మంత్రి అన్నారు. తనపై అనుచిత వాఖ్యలు హానికరమైన వాఖ్యలు చేస్తే జరిగే పరిణామాలతో తనకు గాని, తమ పార్టీకి గాని ఎటువంటి సంబంధమూ లేదన్నారు. పార్టీలో కలసిన మీసాల వరహాలనాయుడుతో పాటు నియోజకవర్గంలో ఉన్న నాయకులంతా కలిసి పనిచేయాలని సూచించారు. అంతకు ముందు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మీసాల వరహాలనాయుడు, మాజీ సర్పంచ్ మీసాల సరోజిని. డాక్టర్ ఆర్.విజయసారధిరావుతో పాటు సుమారు 5 వందల కుటుంబాలు మంత్రి సమక్షంలో వైసిపిలో చేరారు.కార్య క్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, జిల్లా యుజన ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణితో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ గెలుపుకోసం అందరితో కలసి పని చేస్తాను

వైసిపి గెలుపుకోసం అందరితో కలసి పని చేస్తానని మీసాల వరహాలనాయుడు అన్నారు. పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అబివృద్ధికి టిడిపి నాయకత్వం అటంకంగా ఉండబట్టే తన అనుచర వర్గంతో పాటు వైసిపిలో చేరామని అన్నారు. అంతకు ముందు తన ఇంటి నుండి బారీ ర్యాలీగా సభా స్థలం వద్దకు చేరుకున్నారు.

రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శంకుస్థాపన

- అమృత్ భారత్ స్టేషన్లుగా చీపురుపల్లి, కొత్తవలస, బొబ్బిలి
- జిల్లా కేంద్రంలో రైలు వంతెన నిర్మాణం

బొబ్బిలి సభలో మాట్లాడుతున్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి-విజయనగరంకోట, బొబ్బిలి చీపురుపల్లి, కొత్తవలస

జిల్లాలో మూడు రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి చేస్తూ అమృత భారత్ స్టేషన్లుగా రూపొందించేందుకు, నగరంలోని బి.సి.కాలనీ ప్రాంతంలో రైల్వే ట్రాక్‌పై నిర్మించనున్న పైవంతెన నిర్మాణ పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోమవారం వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. నగరంలోని బిసికాలనీ ప్రాంతంలోని మ్యాంగో యార్డు నుంచి రైల్వే ట్రాక్ దాటేందుకు వీలుగా రూ.48.98 కోట్లతో రైల్వేశాఖ నిర్మించనున్న వంతెన పనులకు, కొత్తవలసలో రూ.18.77 కోట్లు, చీపురుపల్లిలో రూ.21 కోట్లతో, బొబ్బిలిలో రూ.16 కోట్లతో అమృతభారత్ స్టేషన్లుగా అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన జరిగింది. నగరంలోని మ్యాంగో యార్డు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు చందక శ్రీను, బి.పద్మావతి, వాల్తేరులోని డిప్యూటీ చీఫ్ సిగ్నలింగ్ టెలికం ఇంజినీర్ సిహెచ్.వి.కారుణ్య, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు శివప్రసాదరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పైవంతెన పనులకు శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విటి అగ్రహారం జెడ్‌పి హైస్కూల్ ప్రదానోపాధ్యాయులు ఎస్.ఎస్.వి.టి.రాజేశ్వరరావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్, క్విజ్ పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

రైల్వే స్టేషన్ ఆధునీకరణ

బొబ్బిలిలో రైల్వే స్టేషన్ ఆధునీకరణకు ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, రైల్వే చీఫ్ ఇంజినీర్ పాండే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్‌పి బెల్లాన మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గంలో మూడు స్టేషన్లు ఆధునీకరణ జరుగుతుందన్నారు. అండర్ బ్రిడ్జిలో నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కోరారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలు టైమింగ్స్ మార్చాలని రైల్వే అధికారులను కోరారు. ¯ బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావ, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

కొత్తవలస రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రైల్వేశాఖ అధికారులు సి.ఆర్.దాస్, శివ నరేష్, పార్వతీశం, వాల్తేరు సిఎంఎస్ జ్యోతి, జే.వి.రావు, సాయిఅనువబ్ నాథ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస రైల్వే సిబ్బంది, పాల్గొన్నారు.

సిపిఎం నాయకుల వినతి

కొత్తవలస రైల్వే గేట్ వద్ద ఫుట్ పాత్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ రైల్వే అధికారులకు వినతి అందజేశారు. ప్రతిరోజు పాదాచారులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కొత్తవలస రైల్వే స్టేషన్లో కోర్బా, ఇంటర్‌సిటీ, రాయగడ తదితర ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయాలని కోరారు. దీనికి రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారు.

చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగిన శంకుస్థాపన వర్చువల్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘువర్మ, బిజెపి అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి నీలకంఠం పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తేదిన మార్చి 5 తేదీ వరకు పొడిగించినట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. 1వ తరగతిలో చేరే విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చారని తెలిపారు. ఈ అవకాశాని

ఆధార్ ఆపరేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఆధార్ సేవలు అందించడంలో వచ్చే సాంకేతిక సమస్యలు, సందేహాల పరిష్కారంపై గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం గ్రామ వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ విభాగం జిల్లా సమన్వయకర్త జి.ఎస్.నిర్మలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఆధార్ సేవలు అందించడంలో పాటించాల్సిన కొత్త మెళకువలను గురించి ఆధార్ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన బాలప్రసాద్, గ్రామవార్డు సచివాలయ శాఖకు చెందిన వి.వి.ఎస్.సుందరం వివరించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు, కార్మిక సంఘాల నాయకులు

డబ్ల్యుటిఒ ఒప్పందాలకు వ్యతిరేకంగా

రైతు, కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశంలో కార్మిక, కర్షకుల ప్రయోజనాలకు భంగం కలిగించేలా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)తో కేంద్ర ప్రభుత్వం చేసుకుంటున్న ఒప్పందాలను వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల సమన్వయ కమిటీ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన ధర్నా చేశారు. డబ్ల్యుటిఒ సమావేశాన్ని బహిష్కరించాలని, రైతుల ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని, ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ప్రాణాలు తీసిన వారిపై చర్యలు తీసుకోవాలని, పంటలకు మద్దతు ధరల చట్టం, రుణ మాఫీచట్టం చేయాలని, కార్మిక హక్కుల హరించే కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు లోకవరపు అదినారాయణ మూర్తి, సిఐటియు నాయకులు యుఎస్ రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, సిఐటియు నాయకులు యుఎస్ రవికుమార్, బి. రమణ, ఎర్రి నాయుడు , పట్టణ పౌర సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, రైతు సంఘం నాయకులు గెద్ద లక్ష్మి, జొన్నాడ ఉప సర్పంచ్ అప్పలనాయుడు, బంగారునాయుడు, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

ఎస్‌పిపి ఫిర్యాదు చేస్తున్న మహిళ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఎస్‌పి ఎం.దీపిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి 41 ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులతోఫోనులో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికలను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపుఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథ్, ఎస్‌బి సిఐలు కె.కె.వి. విజయనాథ్, ఇ.నర్సింహమూర్తి, డిసిఆర్‌బి ఎస్‌ఐ గణేష్, ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు 175 వినతులు

వినతులు స్వీకరిస్తున్న సహాయ కలెక్టర్ త్రివినాగ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జగనన్నకు చెబుదాంలో వివిధ సమస్యలపై అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సకాలంలో పరిష్కరించాలని డిఆర్ఒ అనిత అధికారులను ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి వాటిపై స్పందించాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.డి.అనిత , సహాయ కలెక్టర్ త్రివినాగ్ , కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీ కృష్ణ, ఆర్‌డిఒ సూర్యకళ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 175 వినతులు అందాయి.

హుదూద్ ఇళ్లు అప్పగించండి

హుదూద్ ఇళ్లను లబ్ధిదారులకు నేటికీ అప్పగించకపోవడం వల్ల అన్యాక్రాంతం అవుతున్నాయని టిడిపి నాయకులు స్పందనలో ఫిర్యాదు చేశారు. వెంటనే లబ్దిదారులకు గృహాలను అప్పగించాలని కోరారు. కొండకారకం, గుండాలపేటలో జగనన్న కాలనీల కోసం రైతుల నుంచి భూసేకరణ చేసి మూడేళ్లు దాటినా కొంతమందికి ఇంకా పరిహారం అందించలేదని, వెంటనే వారికి పరిహారం అందించాలని కోరారు. వినతినిచ్చిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు ,కనకల మురళీమోహన్ , కొండ్రు శ్రీనివాస్, పైడిరాజు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని ధర్నా

విజయనగరం టౌన్ : ఎస్.కోట మండలంలోని ముషిడిపల్లి, పెదఖండేపల్లి, మూలబొడ్డవర, కిల్తంపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో జిందాల్ కంపెనీకి భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద బాధితులు ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి భూ నిర్వాసితులు రైతు లు కర్రీ సత్యన్నారాయణ, పోతన్న, శ్రీరాములు, కనకం మాట్లాడుతూ 2008లో పలు గ్రామాల రైతులు జిందాల్ అల్యూమినా రిఫైనరీ కంపెనీ నిర్మాణం నిమిత్తం భూములిచ్చారని, కానీ నేటికీ ఆర్‌అండ్‌అర్ ప్యాకేజీ, ఉద్యోగాలు ఇవ్వకుండా కంపెనీ అన్యాయం చేసిందని అన్నారు. సుమారు 16ఏళ్లయినా కంపెనీ నిర్మాణం చేపట్టలేదని, జిందాల్ కంపెనీ నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాసిత రైతులకు నగదుతో పాటుగా, షేర్ల రూపేణా ఇవ్వలేదన్నారు. తక్షణమే కలెక్టర్ కలుగుచేసుకొని భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి బొత్సకు వినతి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ కోరారు. సోమవారం గరివిడిలో తన క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి వినతి అందజేశారు. మిమ్స్ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను వివరించారు. మిమ్స్ యాజమాన్యం గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగులు,కార్మికుల పట్ల నియంతత్వ వ్యవహరించి 7డిఎలు ఇవ్వలేదని, వేతన ఒప్పందం చేయలేదని తెలిపారు. సమస్యలపై యాజమాన్యాన్ని అడిగితే సస్పెన్షన్లు, కక్ష సాధింపులు చేసి బదిలీలు, బెదిరింపులు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఒందోళన చేస్తున్నారని వివరించారు. యినా యాజమాన్యం పట్టించుకోకుండా దొంగ చాటుగా వేరే వారితో చర్చలు జరిపడమే కాకుండా కార్మిక శాఖా అధికారులు కూడా యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. మంత్రి బొత్స సత్యనారాయణ స్పందిస్తూ మిమ్స్ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎం.నారాయణ రావు, గౌరీ, కామునాయుడు, రాంబాబు, మధు, వరలక్ష్మి, బంగారు నాయుడు, తదితరులు ఉన్నారు.

స్టాప్ లైన్ ఇ- చలానాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్టాప్ లైన్ ఈ చలనాలు రద్దు చేయాలని రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో ఆటో క్యాబ్ డ్రైవర్లపై విధిస్తున్న ఈ చలానాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇ - చలనాలు చెల్లించేందుకు ఎపి ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఈ చలానాల వెబ్‌సైట్‌లో అనుసంధానం చేయడంతో సమస్య మరింత జటిలమైందని, ఆర్‌టిఒ కార్యాలయానికి వెళ్లేంతవరకు పెనాల్టీ పడిందనే విషయం డ్రైవర్లకు తెలియజేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్టాప్‌లైన్ సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించి ఈ చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డ్రైవర్లను జైల్లోకి పంపే క్రిమినల్ చట్టం బి ఎన్ ఎస్ 106 (1,2)ను రద్దు చేయాలని కోరారు. అనంతరం గ్రీవెన్స్‌లో డిఆర్ఒ అనితకు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో అంబేద్కర్ జంక్షన్ ఆటోస్టాండ్ అధ్యక్షులు వై.రామారావు, వై.భాస్కర్, సిహెచ్‌మోహన్, బి.రామారావు, పి.సాగర్, ఆనంద్ వై.అప్పారావు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పినవేమలిలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి అదితి, పార్టీ నాయకులు

అభివృద్ధికి కృషి చేస్తా : అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పినవేమలి గ్రామ అభివద్ధికి శక్తి వంచన మేరకు కృషి చేస్తానని విజయనగరం టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తెలిపారు. సోమవారం పినవేమలి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రచ్చ బండ కార్యక్రమంలో రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు టిడిపి-జనసేన కలయికలో వస్తున్న ప్రభుత్వం ప్రజల కోసం, ప్రగతి కోసం అందరూ ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, పట్టణ నాయకులు అవనాపు విజయ్, జనసేన మండల అధ్యక్షులు బొబ్బాది చంద్ర నాయుడు మండల, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురిలో జయహో సభ

నగరంలోని ధర్మపురిలో సోమవారం టిడిపి ఆధ్వర్యాన జయహో బిసి సభ నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో బిసిలకు జరుగుతున్న అన్యాయం, దాడుల గురించి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి వివరించారు. బిసి నాయకులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టిడిపి - జనసేన పార్టీలకు మద్దతుగా బిసిలందరూ నిలిచి అదితి విజయలక్ష్మి గజపతి రాజును గెలిపించాలని నాయకులందరూ కోరారు.

28న వడ్డీ మాఫీ నిధులు విడుదల

ప్రజాశక్తి- బొబ్బిలి

ఖరీఫ్, రబీ పంట రుణాలు సకాలంలో చెల్లించిన రైతులకు వడ్డీ మాఫీ నిధులు ఈనెల 28న ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఏడి మజ్జి శ్యామసుందర్ తెలిపారు. బొబ్బిలి మండలంలో రబీ 1511 మందికి రూ.27.94లక్షలు, ఖరీఫ్ 1111 మందికి రూ.23.21లక్షలు, బాడంగిలో రబీ 633 మందికి రూ.12.69లక్షలు, ఖరీఫ్ 1236 మందికి రూ.12.55లక్షలు, తెర్లాంలో రబీ 640 మందికి రూ.9.72లక్షలు, ఖరీఫ్ 2064 మందికి రూ.39.16లక్షలు, రామభద్రపురంలో రబీ 526 మందికి రూ.10.79లక్షలు, ఖరీఫ్ 550 మందికి రూ.10.64లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన రైతులకు వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు.

రైతులకు ఐకెవైసి తప్పనిసరి

రామభద్రపురం: ప్రతీ రైతుకు ఐకెవైసి తప్పనిసరిగా ఉండాలని బొబ్బిలి ఎడిఎ మజ్జి శ్యామసుందర్ తెలిపారు. సోమవారం స్థానిక ఏవో వెంకటయ్యతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు బరోసా నిధులు విడుదలకు ఇది తప్పనిసరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ సమ్మాన్ నిధి 16వ విడతగా 2వేలు రూపాయలు ఈ నెల 28న జమ చేస్తారన్నారు. సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ మాఫీ నిధులు మంజూరయ్యాయన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం డిప్యూటీ డిఇఒ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం చేస్తున్నాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రచార చేసి అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

నేడు డయల్ యువర్ డిఎం

శృంగవరపుకోట: మంగళవారం సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక డిపో పరిసర ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఏటువంటి సందేహం ఉన్నా డిపో మేనేజర్ 9959225619, సూపరింటెండెంట్ 7382923679 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

జామి: మండలంలోని కుమరం గ్రామానికి చెందిన పోలిపల్లి దుర్గ (22) అనే ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఆమె తల్లి లక్ష్మి జామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాలు ప్రకారం. శనివారం ఉదయం 9 గంటల సమయంలో బ్యూటీషియన్ కోర్స్ నేర్చుకుంటానని ఇంట్లో చెప్పి విజయనగరం వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జి ఆర్‌డిఒ కె.సందీప్ కుమార్ హెచ్చరించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం లింగ నిర్ధారణ పరీక్షలపై సమావేశం నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసే చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పిపి యూనిట్ వైద్యాధికారి సంతోషికుమారి, స్త్రీ వైద్య నిపుణులు పద్మావతి, ఎం.స్వాతిని ఆదేశించారు. ఆడపిల్లలు పట్ల వివక్షత చూపవద్దన్నారు. ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

జరజాపు పేటలో ఉద్యోగులకు సత్కారం

నెల్లిమర్ల: జరజాపుపేటలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సత్కారం జరిగింది. ఆదివారం రాత్రి నగర పంచాయతీ పరిధి జరజాపు పేటకు చెందిన గాంధీ రాం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఉద్యోగాలు పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను సత్కరించారు. వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, మొయిద స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బేతా మహాలక్ష్మి, నాగ వంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు చేతుల మీదుగా జరిగిన సత్కారంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఇదే గ్రామానికి చెందిన ఉత్తమ అవార్డు గ్రహీత గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు, పదోన్నతి పొందిన మెరక ముడిదాం ఎంఇఒ మాత చంద్ర శేఖర్, జిఎల్ఎ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన జె. ధనుంజయ్, స్కూలు అసిస్టెంట్ ఉద్యోగాలు పొందిన కాళ్ళ రాజ్, కాంట్రాక్టర్ బుగత శ్రీను గాంధీ రాం ఎడ్యుకేషనల్ సొసైటీ తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాంధీ రాం ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు మద్దిల సన్యాసి రావు, పోలు బోతు నారాయణ మూర్తి, టి.వెంకట రమణ, టి.నారాయణ మూర్తి, నల్లి శ్రీను, టి. సన్ని బాబు, గుర్ల ఎంఇఒ ఎస్. భాను ప్రకాష్, గజపతినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సిహెచ్ రమేష్ కుమార్, డైట్ లెక్చరర్ మాత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

28న సెంచూరియన్‌లో కిసాన్ మేళా

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి చెప్పారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 28న మంత్రి బొత్స విశ్వవిద్యాలయంలో స్కూల్ ప్రారంభోత్సవం అనంతరం కిసాన్ మేళా కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 28, 29 తేదీలలో కిసాన్ మేళా ఉంటుందన్నారు. ఇందుకోసం దాదాపు 34 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇటీవల ఉండగా ఈ ఏడాది నుంచి ఇంజినీరింగ్, పారామెడికల్, మేనేజ్మెంట్ విభాగాలలో కొత్తగా మరో 20 రకాల కోర్సులు ప్రవేశపెడుతున్నామని వివరించారు. వాటిలో బీఎస్సీ నర్సింగ్, బి.ఫార్మసీ, ఎమ్మెస్సీ, ఎంబిఎ వంటి కోర్సులు ఉన్నాయన్నారు. దీంతో ఇక నుంచి విశ్వవిద్యాలయంలో మొత్తం 41 రకాల కోర్సులు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

సంగాంలో ప్రసాదాలకు వేలం

వంగర: మండలంలోని సంగాం సంగమేశ్వరాలయం వద్ద మార్చి 8 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని యాత్రికులకు లడ్డు పులిహోర ప్యాకెట్లు అందించేందుకు ఆలయ ఈఓ కె శివ కేశవరావు, ప్రత్యేక అధికారి బీపీ మాధవరావు ఆధ్వర్యంలో సోమవారం వేలంపాట నిర్వహించారు. సంగాం గ్రామానికి చెందిన గొర్లె సంగం నాయుడు రూ.81వేలకు వేలం పాటను దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. చైర్మన్ బొను నాగరాజు, గ్రామ అర్చకులు సిద్ధాంతం గణపతిరావు, గేదెల రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ వైద్యానికి ఆర్థిక సాయం

బొబ్బిలి: ఒడిశాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బైక్ మెకానిక్ జె. దాడిబాబు వైద్యానికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. పట్టణంలోని గొల్లవీధికి చెందిన దాడిబాబు రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడిబాబుకు తల్లిదండ్రులు లేకపోవడంతో మాజీ కౌన్సిలర్ జెకె అందుకు బేబినాయన దృష్టికి తీసుకు వెళ్లడంతో వైద్యానికి ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

జనసేనకు ఒక్క సీటు కేటాయించడం దారుణం

నెల్లిమర్ల: జిల్లాలో జనసేనకు ఒక్క సీటు కేటాయించడం దారుణమని జనసేన మండల అధ్యక్షులు పతివాడ అచ్చంనాయుడు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వెనుక బడ్డ జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరంలలో జనసేనకు పొత్తులో భాగంగా ఒక్క సీటు కేటాయించడం దారుణమన్నారు. ముఖ్యంగా నెల్లిమర్ల అసెంబ్లీ సీటును ఓసి జనాభా తక్కువగా ఉన్న అదే సామాజిక వర్గానికి జనసేన తరఫున కేటాయించడం బాధాకరమన్నారు. దీనిపై భవిష్యత్ కార్యాచరణ పై జిల్లా కేంద్రం మొసానిక్ టెంపుల్ లో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నామన్నారు. జనసేన సైనికులు, వీర మహిళలు తప్పక హాజరు కావాలని అచ్చం నాయుడు కోరారు.

'గురజాడ' విద్యార్థులకు పతకాలు

విజయనగరం టౌన్: ఎస్ఒఎఫ్ అంతర్జాతీయ మాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో గురజాడ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 4వ తరగతి విద్యార్థిని ఆర్.నిహారిక సాయి, 6వ తరగతి విద్యార్థి ఎం. కౌశిక్, 9వ తరగతి విద్యార్థి ఎల్.తరుణ్ గోల్డ్ మెడల్స్ సాధించారు. ప్రతిభ చూపిన ఈ ముగ్గురు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, ఏఒ వాసు, గణిత ఉపాధ్యాయులు అభినందించారు.

7లోగా అభివృద్ధి పనులు ప్రారంభించాలి

● ఎరువుల సొమ్మును 48 గంట్లలోగా ప్రభుత్వానికి జమచేయాలి ● అనధికార వ్యక్తులతో పనులు చేయించవద్దు ● సమీక్షలో మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి, వీలైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులను రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. మార్చి 7వ తేదీలోగా ప్రారంభోత్సవాలు పూర్తి కావాలని స్పష్టం చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని మెరకముడిదాం మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని మంత్రి నిర్వహించారు. రీసర్వే, గృహనిర్మాణం, రహదారులు, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, డ్వామా, రెవెన్యూ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను, పనుల పురోగతని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ, నాడూ-నేడు, గడప గడపకు, ఉపాధిహామీ కన్వర్జెన్సీ తదితర పనులు కోడ్‌తో సంబంధం లేదని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న పనులు కొనసాగుతాయని, కొత్తవి మాత్రం ప్రారంభించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. అయినప్పటికీ అధికారులంతా ఎప్పటిలాగే సమర్ధవంతంగా, సమన్వయంతో పనిచేసి ప్రస్తుతం జరుగుతున్న పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి, 7వ తేదీలోగా ప్రారంభించాలని మంత్రి కోరారు. రెండు మూడు రోజుల్లో నాడు-నేడు పనుల బిల్లులు మంజూరు కానున్నాయని, పూర్తయిన పనుల బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. అన్ని రకాల అభివృద్ధి పనుల బిల్లులనూ మరోవారం పదిరోజుల్లో పూర్తిగా చెల్లించడం

మెరకముడిదాంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

జరుగుతుందని, అధికారులు అలసత్వం చూపించకుండా ఎప్పటికప్పుడు బిల్లులు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఇంటింటి నీటి సరఫరాను మెరుగు పరచాలని సూచించారు. అర్హత ఉన్న వారి అసైన్డ్ భూములకు మాత్రమే పూర్తి హక్కులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. అసైన్డ్ పట్టా కలిగి ఉండి, భూమి వారి ఆధీనంలో ఉన్నవారికి మాత్రమే ఇతర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హక్కులు కల్పిస్తామన్నారు. అలాంటి అర్హులు ఎవరైనా మిగిలిపోయి ఉంటే, తహశీల్దార్, ఆర్‌డిఒలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇలాంటి భూ సమస్యలు ఏమైనా ఉంటే మార్చి 5లోగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. గర్భాం, శాతాంవలస ఆధార్ కేంద్రాలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. కస్తూరిబా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పనితీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పిఎసిఎస్ అధికారులు తాము అమ్మిన ఎరువుల సొమ్మును 48 గంటల్లోగా ప్రభుత్వానికి జమ చేయాలని ఆదేశించారు. అనధికార వ్యక్తులచేత ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించవద్దని, ఇలాంటివి తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారి సేవలు అవసరం అనుకుంటే ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఆర్‌డిఒ బి.శాంతి, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, తహశీల్దార్ వైవి పద్మావతి, ఎంపిడిఒ ఎం.పావని, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, బొత్స సందీప్, రమణరాజు, కెఎస్ఆర్‌కె ప్రసాద్, కె.విశ్వేశ్వర్రావు, తాడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి చేతులమీదుగా పేదలకు పట్టాలను పంపిణీ చేశారు.

గుర్ల: మండలంలోని గరికివలస గ్రామంలో సచివాలయం, వెల్‌నెస్, ఆర్‌బికెలను మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిపి ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, సర్పంచ్ బెల్లాన సన్యాసమ్మ, డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు జమ్ము స్వామినాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

పేదోడి సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు ఆయన చేతులమీదుగా ఇళ్ళ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాళ్లు ఉండకూడదని మొదటి విడతగా 31 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు సిఎం మంజూరు చేశారని తెలిపారు. పేద ప్రజల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గత ప్రభుత్వాల మాదిరి మాటలు చెప్పి మాయ చేసే ప్రభుత్వం తమది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, తహశీల్దార్ సులోచనారాణి, మండల పార్టీ అధ్యక్షులు అప్పికొండ లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంగర: వైసిపితోనే పేద ప్రజల సంక్షేమం సాధ్యమని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక

పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

మండల పరిషత్ కార్యాలయంలో 110 మందికి ఆయన చేతుల మీదుగా సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి గూడు కూడు విద్య వైద్యం వైసిపి ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శనరావు, తహశీల్దార్ సుధాకర్, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ జామి మురళి, మహిళ సమాఖ్య అధ్యక్షులు కే భగవతి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని తిరుమల మెడికవర్ ఆసుపత్రి లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చిన్నపిల్లలకు గుండె శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. తిరుమల ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఆసుపత్రిలో పెద్దవారికి మాత్రమే గుండె శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు, ప్రస్తుతం పదేళ్ల లోపు చిన్న పిల్లలకు కూడా ఆధునిక పరిజ్ఞానంతో కుట్టు, కోత లేకుండా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు తెలిపారు. పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ రాజు ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలోని మెరకముడిదాం మండలం బంటుపల్లికి చెందిన సబ్బిశెట్టి శ్రావణి, గరివిడి మండలం చుక్క వలసకు చెందిన రేవళ్ల ద్రాక్షాయిని అనే ఇద్దరు బాలికలకు ఆధునిక డివైస్ క్లోజర్ ప్రొసీజర్ ద్వారా విజయవంతంగా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు తెలిపాఉ. పదేళ్ల లోపు వయసు కలిగిన వీరు శస్త్ర చికిత్స జరిగిన కేవలం రెండు రోజుల్లో

చిన్నారులతో తిరుమల-మెడికవర్ వైద్యులు

కోలుకున్నారన్నారు. హార్ట్ సర్జరీ జరిగిన తరువాత ఏడాది వరకు ఎవరూ కోలుకోలేరని, ఇప్పుడు కొత్త విధానం ద్వారా కేవలం రెండు రోజుల్లో మనిషి కోలుకొని నడవడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీలో కూడా చిన్న పిల్లల గుండె శస్త్ర చికిత్సల వైద్య సౌకర్యం ఉందన్నారు. సమావేశంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ రాజు, డాక్టర్ మహేశ్వర రావు, ఆసుపత్రి సెంటర్ హెడ్ పద్మ కుమార్, డాక్టర్ పి.ఎస్.వి.రామారావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్ కుమార్ పాత్రో, డాక్టర్ బి.రవి కిషోర్ ,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రొఫెసర్ శాంతమ్మ ఆదర్శం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రొఫెసర్ శాంతమ్మ అందరికీ ఆదర్శప్రాయురాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఇక్కడ జీలకర్రగూడేం లయన్స్ క్లబ్, తాడేపల్లిగూడేంలోని డైమాండ్స్ లయన్స్ క్లబ్ కలసి సంయుక్తంగా ప్రొఫెసర్ శాంతమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ శాంతమ్మ వివిధ రంగాలలో అనేక మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. 96 ఏళ్ల వయసులో ఇప్పటికీ ఆమె చురుకుగా పనిచేస్తొన్నారని కొనియాడారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ ఆమె ఇక్కడ సేవలు అందించడం తమ అదృష్టమన్నారు. లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్‌పర్సన్ ఆర్.ఆర్.రత్నకుమారి మాట్లాడుతూ డాటర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ లో చేరిన మొట్టమొదటి మహిళగా బ్రిటీష్ రాయల్ సొసైటీ ఆమెకు గుర్తింపునిచ్చిందన్నారు. ఆమెను సత్కరించుకోవడం తమ అదృష్టంగా భావిస్తొన్నామన్నారు. మరో జోన్ చైర్మన్ పి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ అత్యున్నత స్థాయిలో ఉన్న మహిళకు సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ఆమె

శాంతమ్మను సత్కరిస్తున్న అధ్యాపకులు, చాన్సలర్

సరస్వతి పుత్రికగా పేర్కొన్నారు. అనంతరం శాంతమ్మకు శాలువతో సత్కరించి మెమెంటోను బహూకరించారు. అనంతరం ఆమె పుట్టిన రోజు వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శాంతమ్మ మాట్లాడుతూ మరో నాలుగేళ్లలో సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో తాను శత జన్మదినోత్సవ వేడుకలు జరుపు కుంటానని స్పష్టం చేశారు. ప్రత్యేక అతిధులుగా లయన్ ఆర్.ఆర్. రంగరాజు, రేణుక, మురళీకృష్ణ, ఇందిర ప్రభ పాల్గొనగా కార్యక్రమంలో గ్రామ్ తరంగ్ ఎంప్లాయ్ మెంట్ అండ్ ట్రెనింగ్ సిఇఒ బాబు శంకర్, డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీడియోల్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో ఎల్.కోట విజేత

ప్రజాశక్తి - కొత్తవలస

శారద కంపెనీ నిర్వహించిన వాలీబాల్ లీగ్ మ్యాచ్‌లో లక్కవరపుకోట జట్టు విజేతగా నిలిచింది. గత మూడు రోజులుగా శారద కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్లో ప్రథమంగా నిలిచిన ఎల్‌కోటకు సోమవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ ప్రభాత్ మోహన్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిగా లక్కవరపుకోటకు రూ.1.25 లక్షలు చెక్కును రెండవ బహుమతిగా కొత్తవలసకు రూ.60 వేలు, మూడవ బహుమతిగా విజయనగరం జట్టుకు రూ.30వేలు, నాల్గవ బహుమతిగా జామికి రూ. 20వేలు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ శారద యాజమాన్యం ఇటువంటి క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ వాలీబాల్ పోటీలో పాల్గొన్న 16 టీములకు బనియన్లు, రెండు బాళ్లు, నెట్

ఎల్‌కోట జట్టుకు ట్రోపి, చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, కంటకాపల్లి, కాటకాపల్లి సర్పంచులు మదిన అప్పల రామ్, పీతల కృష్ణ, వైసీపీ నాయకులు, కంపెనీ ఏజీఎం సూర్య భాస్కర్, హెచ్. ఆర్. సహాయక మేనేజర్ శంకర్రావు, సంతోష్ కుమార్, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్ దాస్, జిల్లా అసోసియేషన్ నాయకులు కృష్ణంరాజు, జాతీయ వాలీబాల్ కోచ్ గవర సూరిబాబు, ఎల్‌జిఎన్ కుమార్, పాల్తేటీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి మార్కులు సాధించాలి

ప్రజాశక్తి - జామి

పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ ఉపాధ్యక్షులు ఎం. హర్ష రమేష్ అన్నారు. ఫిబ్రవరి 4న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాస పరీక్షలలో మండలంలో 1,2,3 స్థాయిలో నిలిచిన విజేతలకు సోమవారం మండల విద్యాశాఖ అధికారులు జయశ్రీ, గంగరాజుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేయడమే కాకుండా అనేకమైన సేవా కార్యక్రమాలు చేపడుతూనే విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఎస్ఎఫ్ఐ అనేక బహుముఖ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే విద్యార్థులను రాబోయే మరిన్ని పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞవికాస

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఇఒలు

పరీక్ష నిర్వహించామన్నారు. ఇందులో మండల స్థాయిలో వి.సూర్య తేజ (రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్)కు మొదటి స్థానం, జి.పూజిత (బాపూ విద్యానికేతన్ స్కూల్), బి.శశి కపూర్ (గవర్నమెంట్ హై స్కూల్, జామి)లకు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించడంతో వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - వంగర

మాజీమంత్రి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో అరసాడ గ్రామానికి చెందిన పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు మజ్జి వెంకట నాయుడు, ఎస్‌సి, బిసి కులాలకు చెందిన నాయకులు పరసుబోతు వెంకట నాయుడు, కొరటాన గౌరనాయుడు, దొంతల దుర్గారావు, రాగోలు రమేష్, చితిరి దాలిరాము, మజ్జి అశోక్ తదితరులు వైసిపి పార్టీని వీడి టిడిపిలో చేరారు. వీరందరికీ కొండ్రు మురళీమోహన్ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసిపిలో ఉండి కష్టపడి పని చేసినప్పటికీ ఇప్పటివరకు కనీసం గుర్తింపు లభించకపోవడంతో టిడిపిలో చేరినట్లు వెల్లడించారు. మండలంలో పెద్ద గ్రామమైన అరసాడలో వైసిపిని వీడి టిడిపిలో పలువురు చేరడంతో టిడిపికి మరింత బలం చేకూరుందని కొండ్రు మురళీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లచ్చు బుక్త కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

ప్రజాశకి-విజయనగరం టౌన్

స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్. పల్లవి, సిహెచ్ శ్రీలక్ష్మి ఈనెల 19 నుంచి అరుణాచలప్రదేశ్‌లోని ఇట్లానగర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పతకాలు సాధించారు. పల్లవి 64 కేజీల విభాగంలో స్నాచ్ - 80 కేజీలు, జర్క్ - 95కేజీలు మొత్తం 175 కేజీలు పూర్తి చేసి రజిత పతకం సాధించింది. సిహెచ్ శ్రీలక్ష్మి 81 కేజీల విభాగంలో స్నాచ్ -85 కేజీలు, జర్కు 100 కేజీలు మొత్తం 185 కేజీలు పూర్తి చేసి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్య వేణి, ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి. సూ రపు నాయుడు వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

స్థానికంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎపిఒ ఆదిలక్ష్మి పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో వేతనదారుల వివరాలను పరిశీలించి వారితో మాట్లాడారు. పని వేళలు పాటించాలని, అందరూ కష్టపడి పని చేస్తే తప్ప వేతనం గిట్టుబాటు కాదని, తవ్విన మట్టిని దూరంగా చెరువులోకి జారకుండా వేయాలని వేతనదారులకు సూచించారు. ఈ పరిశీలనలో ఆమెతో పాటు క్షేత్రస్థాయి సహాయకుడు డి. ఆనంద్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రహదారి నిర్మించండి

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు తమ శ్మశాన వాటికకు రహదారి నిర్మించాలని, మౌలిక వసతులు కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ మేరకు ఆ కాలనీకి చెందిన నరవ అసిరివాడు, మరికొందరు సోమవారం ఒక ప్రకటనలో తమ ఆవేదనను వెల్లగక్కారు. గత 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమ 65 కుటుంబాలు శ్మశాన వాటికకు వెళ్లే మార్గం సరిగా లేక నానా అవస్థలకు గురవుతున్నామని చెప్పారు. ఈ సమస్యను ఎన్ని పర్యాయాలు గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2021లో స్పందన ద్వారా ఫిర్యాదు చేశామని, ఈ మేరకు జిల్లా అధికారులు ఇచ్చిన ఆదేశాలను కూడా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. రహదారి సౌకర్యం లేక మృతదేహాలు తీసుకువెళ్లేటప్పుడు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని శ్మశాన వాటికలో షెడ్ నిర్మించి, బోరు బావి ఏర్పాటు చేయాలని తద్వారా తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పార్టీ పదవులకు రాజీనామా చేస్తాం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సైకిల్ గుర్తును, టిడిపిని వదిలేసి జనసేన పార్టీకి ఊడిగం చేయలేమని మండలంలోని 15 పంచాయతీల టిడిపి నేతలు పార్టీ నిర్ణయంపై ఆవేదన వ్యక్తం చేశారు. నెలిమర్ల టిడిపి ఇంచార్జి కర్రోతు బంగారాజుకు టికెట్ ఇవ్వకుండా జనసేనకు కేటాయించడంపై మండలంలోని కొంతమంది టిడిపీ నాయకులు ఓ ప్రవేటు పంక్షన్ హాల్‌లో సోమవారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ ఇజ్జురోతు ఈశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాదరావు మాట్లాడుతూ బంగారాజుకు టికెట్ కేటాయించకపోతే మూకుమ్మడిగా పదవులకు రాజీనామా చేస్తామన్నారు. బంగార్రాజు ఇండిపెండెంటుగా పోటీలో ఉంటారన్నారు. 80 శాతం బిసిలు ఉన్న నియోజకవర్గంలో అగ్రవర్ణాలకు సీటు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శిలు దంగా భూలోకా, మైలపల్లి సింహాచలం మాట్లాడుతూ బంగార్రాజు ఏ నిర్ణయం తీసుకున్నా స్వీకరిస్తామన్నారు. సీనియర్ నాయకులు వెంపడాపు సూర్యనారాయణ మాట్లాడుతూ బంగార్రాజు ఇండిపెండెంటుగా పోటీలో లేకపోతే ఎఎంసి మాజీ చైర్మన్ ఇజ్జురోతు ఈశ్వర్రావు పోటీలో ఉంటారని ప్రకటించారు. ఈ సమావేశంలో మహిళా అధ్యక్షులు మంగమ్మ, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రౌతు స్వామినాయుడు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వినర్ రాకేష్‌శర్మ, నాయకులు పిళ్లా అప్పలనాయుడు, లక్ష్మినారాయణ, ధువ్వు అప్పలస్వామి, దంతులూరి సూర్యనారాయణ రాజు, డొప్ప జోగులు, పిన్నింటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పతివాడ నారాయణ స్వామినాయుడు గ్రూపు దూరంగా ఉంది. మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకరావుతో పాటు రాష్ట్ర కార్యదర్శిలు మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మునాయుడుతో పాటు సర్పంచులు, ఎంపిటిసిలు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు తెలుస్తుంది.

నాయుడుకు అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

గంట్యాడ: రానున్న ఎన్నికలలో గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎకె నాయుడుకు అవకాశం కల్పించాలని టిడిపి క్రియాశీలక కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం గంట్యాడ కెపిఎన్ బిఈడి కళాశాలలో కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు మాట్లాడుతూ బొత్సకు దీటైన అభ్యర్థి కొండపల్లి అప్పలనాయుడు మాత్రమేనని అన్నారు. కొండపల్లి కుటుంబం అంతా నాయుడుతో ఉన్నారని చెప్పారు. సమావేశంలో సీనియర్ నాయకులు కొండపల్లి భాస్కర్ నాయుడు, పి.విజయ్ కుమార్, రండి చిన్న రామునాయుడు, బూడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ని ఎమ్మెల్యేగా గెలిపించాలి

రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా కొండపల్లి శ్రీనివాస్‌ని గెలిపించాలని మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు అన్నారు. సోమవారం జగ్గాపురం గ్రామంలో కార్యకర్తలతో ఆయన సమావేశమైయ్యారు. సర్పంచ్ కొండపల్లి శ్రీధర్, మాజీ సర్పంచ్ కొండపల్లి అప్పలనాయుడు, వసాది మాజీ ఎంపిటిసి శేజగన్నాథం, మాజీ సర్పంచ్ కె. నూకల నాయుడు, బంగారు నాయుడుతదితరులుపాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు : కోలగట్ల

విజయనగరం టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయడమే కాకుండా వాటికి పూర్తి హక్కు పత్రాలను కూడా అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పునరుద్ఘాటించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. నగర పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఇప్పటికే గుంకులాం, జమ్ము, కొండకరకాం, సారిక, ప్రాంతాలలో మొత్తం 19,601 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేశామన్నారు. వాటిలో ఇప్పటివరకు 12,009 మంది లబ్ధిదారుల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి అయిందన్నారు. లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయ కుండా ప్రక్రియను పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వాని దేనని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, సహాయ కమిషనర్ తిరుమలరావు, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కు పనులు పరిశీలన

నగరంలోని 17వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న చిల్డ్రన్స్ పార్క్ పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పరిశీలించారు. సోమవారం పార్కులో చేపడుతున్న పనులు ప్రగతిని సమీక్షించారు. పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల వ్యాయామ పరికరాలు, క్రీడా సామగ్రి, సుందరీకరణకు చేపడుతున్న అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.